
సాక్షి ఒడిశా

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024




శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 3,70,062
బంగారం: 12 గ్రాములు
వెండి: 1 గ్రాము 900 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



పులి భయం

భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు వద్ద పులి ఉందనే వదంతులు వ్యాపించాయి. పాద ముద్రలు కనిపించాయి. - 8లో



చెట్ల నరికివేత

అంబాగుడలో చెట్లు నరికేస్తున్నారు. వాటిని అక్రమంగా తరలిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

కాలి నడకన శబరిమలకు



కాలి నడకన శబరిమలకు బయల్దేరిన స్వాములు

రాయగడ: అయ్యప్ప దీక్షల్లో భాగంగా ఈసారి జిల్లాలోని గుణుపూర్ నుంచి ముగ్గురు భక్తులు శబరిమలకు కాలినడకన వెళ్తున్నారు. శనివారం అయ్యప్ప మందిరంలో పూజార్చనలు చేసిన జె.వెంకటరావు, ఓటీ శ్రీను, రాజేంద్ర నాయక్‌లు నడక ప్రయాణాన్ని ప్రారంభించారు. గుణుపూర్‌లో ప్రప్రథమంగా ఇలా కాలి నడకన సుమారు రెండు వేల కిలోమీటర్లపైగా అయ్యప్ప భక్తులు వెళ్తుండడంతో ప్రజలు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నేడే పరబ్ లాంచింగ్



పరబ్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కొరాపుట్ కలెక్టర్ కీర్తివాసన్

కొరాపుట్: రాష్ట్రస్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవం పరబ్–24 ఆదివారం నుంచి ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ పరబ్ ప్రారంభమయ్యే సిమిలిగుడ సమితి దుదారి సమీపంలోని మౌలిమా దేవాలయాన్ని శనివారం సందర్శించారు. ఆదివారం ఉదయం ఇక్కడ ప్రారంభ పూజలు చేసి ఉత్సవాలు అధికారికంగా ప్రారంభిస్తారు. ముగింపు ఉత్సవాలను నవంబర్ 15 నుంచి కొరాపుట్ జిల్లా కేంద్రంలోని పరబ్ మైదానంలో జరగనున్నాయి.

రెస్టారెంట్ సీజ్



రెస్టారెంట్‌ను సీజ్ చేసిన అధికారులు

రాయగడ: స్థానిక న్యూకాలనీలోని సాయిరాం రెస్టారెంట్‌ను అధికారులు సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలను దృష్టిలో పెట్టుకుని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సౌమ్యరంజన్ మిశ్రా, జిల్లా పౌరసరఫరాల శాఖకు చెందిన సిబ్బంది శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ రెస్టారెంట్‌కు సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో పాటు నిర్వహణకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ దాడుల్లో భాగంగా రెండు డొమాస్టిక్ గ్యాస్ సిలెండర్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు రెస్టారెంట్ తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

160 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితి పిప్పల్‌పోదర్ గ్రామ సమీపంలో శనివారం పోలీసులు 160 కిలోల గంజాయిని పట్టుకున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి వింబధర్ పాండా పిప్పల్‌పోదర్ పరిధిలోని అడవిలో గంజాయి రవాణా జరుగుతోందని సమాచారం అందుకుని దాడి చేశారు. ఈ దాడిలో గంజాయి రవాణాదారులు పారిపోగా.. 160 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.9 లక్షలు ఉంటుందని అధికారి తెలిపారు.

చట్టాలపై అవగాహన

జయపురం: స్థానిక అంబాగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు న్యాయ సచేతన శిబిరం నిర్వహించారు. పాఠశాల న్యాయ సాక్షరత క్లబ్ సభ్యులు, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన హాజరయ్యారు. న్యాయ సాక్షరత క్లబ్‌లో నెలకొనే వివిధ న్యాయపరమైన సమస్యలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రజలను చైతన్యపరచటంలో విద్యార్థులు ముఖ్య భూమిక నిర్వహించాలన్నారు. ఈ శిబిరంలో చీఫ్ లీగల్ డిప్యూటీ లీగల్ ఎయిడ్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది హరిశ్చంద్ర ముదులి, పేనల్ న్యాయవాది బినయ బిశ్వాస్, హెచ్‌ఎం సునీల కుమార్ పాడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దానా పంట నష్టంపై.. కసరత్తు

- జియో టెక్నాలజీతో సర్వే: మంత్రి
- పరిహారం ప్రత్యక్ష బదిలీ



పంట నష్టం సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్లు

భువనేశ్వర్: దానా తుఫాన్ రాష్ట్రంలో పంటని నీట ముంచింది. నష్టాన్ని అంచనా వేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయం, రైతు సాధికారిత విభాగం మంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ తెలిపారు. స్థానిక కృషి భవన్‌లో శనివారం దానా తుఫాన్‌తో పంట నష్టం స్థితిగతుల్ని మంత్రి సమీక్షించారు. తుఫాన్ వైపరీత్యానికి గురైన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా పంట నష్టం విశ్లేషించారు. ఎక్కడికక్కడ వర్షాలు కురుస్తుండగా మరికొన్ని చోట్ల పొలాల్లో పంట నీట మునిగి ఉంది. ఈ పంట వాస్తవ నష్టం అంచనా సాధ్యం కాలేదు. కను సన్నల్లో పంట నష్టం మాత్రమే విశ్లేషించి ప్రాథమిక నివేదిక వివరాల్ని కలెక్టర్లు వివరించారు.

సర్వే సుస్పష్టం

నీట మునిగిన పంట నష్టం అంచనాలో జియో ట్యాగింగ్ వ్యవస్థని వినియోగించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ విధానంలో పంట నష్టం అంచనా అత్యంత పారదర్శకంగా కొనసాగి బాధిత రైతులకు సముచిత న్యాయం జరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పిదం చోటు చేసుకున్నా బాధ్యులైన వారికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు. సమగ్ర నివేదిక అందడంతో వ్యవసాయ శాఖ, ముఖ్యమంత్రి కార్యాలయం తదుపరి కార్యాచరణ ఖరారు చేసి రైతులకు న్యాయం చేసే దిశలో ముందుకు సాగుతుందన్నారు.

పరిహారం ప్రత్యక్ష బదిలీ

పంట నష్టంతో బాధిత రైతాంగానికి తగిన పరిహారం ప్రత్యక్షంగా బదిలీ చేయనున్నారు. ఈ మేరకు సమగ్ర నివేదిక అందడంతో బాధిత రైతాంగం పొదుపు ఖాతాలకు పరిహారం నగదు ప్రత్యక్షంగా బదిలీ చేస్తామని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనరు (ఎస్‌ఆర్‌సి) కార్యాలయం జారీ చేయనున్న సరికొత్త మార్గదర్శకాల మేరకు జిల్లా కలెక్టర్లు రైతాంగానికి పరిహారం విడుదల చేస్తారు.

పంట నష్టం

దానా తుఫాన్ భద్రక్, కేంద్రాపడా జిల్లాలు అత్యధికంగా ప్రభావితం అయ్యాయి. భద్రక్ జిల్లా 7 మండలాల్లో 88 వేల 594 హెక్టార్ల విస్తీర్ణపు పొలాల్లో పంట నీట మునిగింది. కేంద్రాపడా జిల్లా రాజకనికా, మమాకలపడా, ఔల్ మండలాల్లో 28 వేల 426 హెక్టార్ల పొలాల్లో నష్ట పోయింది. జాజ్‌పూర్, బాలాసోర్, భద్రక్ జిల్లాలు తుఫాన్ తాకిడికి గురై పంటలు ప్రభావితం అయ్యాయి. బాలాసోర్ జిల్లాలో 3 వేల 140 హెక్టార్లు, మయూర్‌భంజ్ జిల్లాలో 2 వేల 381 హెక్టార్లు, జాజ్‌పూర్ జిల్లాలో 2 వేల 381 హెక్టార్ల పొలాల్లో పంట నీట మునిగినట్లు అంచనా.

కనీస నష్ట పరిహారం

దానా తుఫాన్‌తో పీడిత రైతాంగానికి కనీసం రూ. 1,000 పంట పొలం నష్ట పరిహారం చెల్లించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. అర హెక్టారు పంట పొలం నష్టానికి రూ. 4,200 చొప్పున పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. పంట నష్టం పరిహారం రూ.17 వేలు చొప్పున చెల్లిస్తారు. సన్నకారు రైతాంగం పొలంలో పంట నష్టానికి కనీస పరిహారం రూ. 2,000 చొప్పున చెల్లిస్తారు. వ్యవసాయ అటవీ, మొక్కల నష్టం బారిన రైతాంగానికి రూ. 2,500 నుంచి 22,500 పరిహారం చెల్లిస్తారు. స్థానిక కృషి భవన్‌లో నిర్వహించిన ప్రాథమిక సర్వే సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాఢి, ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

ఇస్కాన్ ప్రకటనపై జగన్నాథుని భక్తుల ఆందోళన



ఇస్కాన్ సంస్థ జారీ చేసిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర కార్యక్రమం వివరాలు

భువనేశ్వర్: ఇస్కాన్ సంస్థ జారీ చేసిన శ్రీ జగన్నాథుని రథయాత్ర కార్యక్రమం స్వామి భక్తులను కలవరపాటుకు గురి చేసింది. ఈ ఏడాది నవంబరులో ఇస్కాన్ సంస్థ స్వామి రథయాత్ర నిర్వహించనున్నట్లు పూర్తి వివరాలతో కరపత్రాన్ని ముద్రించారు. స్థానిక ఆచార వ్యవహారాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా స్వామి ఉత్సవాలు, యాత్రలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఇస్కాన్ సంస్థ ఈ ఏడాది నవంబరు నెల 3న స్నానోత్సవం, 9న రథయాత్ర నిర్వహించనున్నట్లు శనివారం తన ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేసింది. దీంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది. ప్రఖ్యాత సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ ఇస్కాన్ కార్యక్రమం కరపత్రం సామాజిక మాధ్యమంలో పెట్టడంతో ఈ కలకలం ఊపందుకుంది.

దుమ్ముతో ప్రజల ఇబ్బందులు



దుమ్మును వెదజల్లుతున్న వాహనం

రాయగడ: ఇటుకల తయారీకి వినియోగించే ఫ్లై యాష్ రవాణాతో పలు ఇబ్బందులు పడుతున్నామని జిల్లాలోని టికిరి ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ల సాయంతో టికిరి మెయిన్ మార్కెట్ గుండా ఫ్లై యాష్ ఇటుకల తయారీ కేంద్రాలకు రవాణా జరుగుతోంది. ఈ సమయంలో టిప్పర్లలోని ఫ్లై యాష్ కింద పడి పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని టికిరి ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ దుమ్ము, ధూళి చుట్టుపక్కల నివసిస్తున్న ఇళ్లలోకి చొరబడి వస్తువులు పాడవుతున్నాయని కలియాపొడకు చెందిన సుందర్ లాల్ నాయక్, మదన్ నాయక్, బెలనాసెన్ నాయక్‌లు అంటున్నారు. దీనిపై పోలీసులు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోకపోతే రహదారిపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గుణుపూర్‌లో చోరీ



పోలీస్ జాగిలంతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను విరగ్గొట్టి 5 తులాల బంగారు ఆభరణాలు, మరో కిలో వెండి వస్తువులు, రూ.20 వేల నగదును దొంగిలించారు. ఈ మేరకు బాధిత కుటుంబీకులు గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గుణుపూర్‌లోని కృష్ణానగర్ 5వ లైన్‌లో నివసిస్తున్న కె.రవికుమార్ అనే వ్యక్తి వారం రోజుల క్రితం శిరిడి యాత్రకు కుటుంబంతో సహా వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. దొంగతనానికి సంబంధించి ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో దుండగుల కదలికలను గుర్తుపట్టిన పోలీసులు, దాని ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నారు.

బైక్, టాటా మ్యాజిక్ ఢీ



కలిమెల ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



తలకు బలమైన గాయంతో బాలుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల, పోడియా మధ్య గల జాతీయ రహదారిలో ఎంపీవీ 33 గ్రామ కూడలి వద్ద శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బైక్‌ను టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వస్తున్న నలుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. రమే మడ్కమి అమిత్ కుంజాలు ఇద్దరూ కలిసి కలిమెలలో ఓ వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్నారు. దారిలో మరో ఇద్దరిని బండి ఎక్కించుకున్నారు. వీరు బైక్‌పై వస్తుండగా పోడియా సమితి ఎంపీవీ 61 గ్రామానికి చెందిన తపన్ కిరణీయ అనే వ్యక్తి టాటా మ్యాజిక్ వాహనంతో వీరి బండిని ఢీకొట్టి పరారైపోయాడు. ఉంద్రుకొండ గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే యువకుడు ప్రమాదం చూసి వెంటనే అంబులెన్స్ పిలిపించి క్షతగాత్రులను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసి చంద్రకాంత్ తండ ఆరోగ్య కేంద్రానికి చేరుకుని క్షతగాత్రులను పరిశీలించి కేసు నమోదుచేశారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరు మృతి



జయరాం హరిజన్ (ఫైల్)

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి అసన గ్రామ పంచాయతీ పకనగుడ జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి చనిపోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వ్యక్తి చలానగుడ వాసి జయరాం గౌడ(28) కాగా.. గాయపడిన వారు రాణిగుడ పంచాయతీ తొరిగుడ గ్రామానికి చెందిన మంజిత్ హరిజన్(27), సుశాంత హరిజన్(20) బాగ్దేరి పంచాయితీ బాగ్దేరి గ్రామానికి చెందిన కిశాన్ హరిజన్(25)లు అని గుర్తించారు. సమాచారం అందుకున్న కుంద్ర పోలీసు అధికారి రంజన్ ప్రధాన్ తన సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకొని గాయపడిన వారిని వెంటనే కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. జయరాం గౌఢ శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు రామగిరి నుంచి బాగ్దేరి ప్రధాన మార్గంలో బైక్‌పై వెళ్తున్నారు. బాగ్దేరికి 3 కిలోమీటర్ల దూరంలో గల పకనాగుడ కూడలి వద్ద అతి వేగంగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో జయరాం హరిజన్‌తో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ నలుగురిని కుంద్ర ఆస్పత్రికి తరలించారు. జయరాం దారిలోనే చనిపోయినట్లు డాక్టర్ గణేష్ ప్రసాద్ దాస్ నిర్ధారించారు. మిగిలిన క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి పంపించినట్లు తెలిపారు. జయరాం మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వితంతువుపై అత్యాచారం

జయపురం: వివాహం చేసుకుంటానని ఆశ చూపి ఒక వితంతువుపై అత్యాచారం జరిపిన ఘటనపై బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు నమోదైంది. నిందితుడు తనను గర్భవతిని చేశాడని, ఆ గర్భాన్ని తొలగించేందుకు ప్రయత్నించాడని, అతనికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. బొయిపరిగుడ సమితి దండాబడి పంచాయితీ పనసపుట్ గ్రామానికి చెందిన ఓ మహిళకి భర్త చనిపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆమె రాయగడ రైల్వే లైన్‌లో కూలీగా పని చేస్తున్నారు. అక్కడ రామగిరి పంచాయితీ చమిలికుండ గ్రామం హరిబందు మాలితో పరిచయం ఏర్పడింది. హరిబందు ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరచుకున్నాడు. గర్భవతి అయ్యానని చెబితే.. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రామగిరికి తీసుకు వచ్చి ఒక అడివిలో విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఆమె అతి కష్టం మీద ఇంటికి చేరి కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. వారు హరిబందు ఇంటికి వెళ్లగా అతడికి పెళ్లయ్యి పిల్లలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

సీఎం ఏరియల్ వ్యూ వాయిదా

భువనేశ్వర్: రాష్ట్రంలో దానా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం పరిశీలించేందుకు శనివారం ఏరియల్ వ్యూ నిర్వహించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నిర్ణయం తీసుకున్నా ఆఖరి క్షణంలో రద్దయ్యింది. శనివారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై అత్యధిక ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటం, బలమైన గాలులు వీస్తుండటంతో అధికారుల సలహా మేరకు సర్వే వాయిదా వేశారు. తదుపరి వివరాలు త్వరలో వెల్లడిస్తారు.

టీచర్లే ఇలా అయితే ఎలా..?

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి అంబకై పంచాయతీలో గల ఘట్టి ప్రాంతంలో ఉన్న అంబపాక ప్రభుత్వ పాఠశాలలో టీచర్లు ప్రతి రోజూ సాయంత్రం నిర్దేశిత సమయం కంటే ముందుగా వెళ్లిపోతున్నారు. బడిలో 30 మంది చదువుతున్నారు. ప్రధానోపాధ్యాయులు శ్యామల్ సీలు, దీపక్ మండల్ పిల్లలను మధ్యాహ్నం రెండు గంటలకే ఇంటికి పంపించేసి వారూ వెళ్లిపోతున్నారు. అక్కడే ఉన్న విలేకరులు ప్రశ్నించగా.. మళ్లీ హడావుడిగా అందరినీ పిలిచి తరగతి గదుల్లో ఉంచారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది.

కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

భువనేశ్వర్: కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లోని అపార్టుమెంట్లలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. బహుళ అంతస్తు భవనాల్లో భద్రత కోసం సెక్యూరిటీ గార్డుల వ్యవస్థ కొనసాగుతున్నా.. దొంగతనాలు ఆగడం లేదు. దీంతో ఆయా అపార్ట్‌మెంట్ల వద్ద ఐపీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జంట నగరాల పోలీసు కమిషనర్ ఎస్. దేవదత్త సింగ్ తెలిపారు. పోలీసు సహాయం కోసం వాట్సాప్ నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉత్సాహంగా నందెన్న ఉత్సవాలు



కెరండీ గ్రామంలో నందమ్మకు పూజలు



పద్మపురం గ్రామంలో నందమ్మకు పిండివంటల నైవేద్యం



పద్మపురం గ్రామంలో జంగమయ్యల వేషాధారణలో బాలలు

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి కెరండీ, గుమ్మా బ్లాక్ పద్మపూర్ గ్రామాల్లో నందోత్సవాలు కొనసాగుతున్నాయి. నందమ్మకు ఇత్తడి బిందె నిండా నూనె వేసి ఈ పదిరోజులు దీపారాధన చేసి, పండ్లు, పిండివంటలు నైవేద్యం సమర్పిస్తారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు అలరిస్తున్నాయి.

చేపల వేటకు వెళ్లి గల్లంతు



నదిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



నది ఒడ్డున బాధితుడు వంట చేసుకున్న సామగ్రి

కొరాపుట్: చేపలు పట్టడానికి వెళ్లిన జాలరి అతి పెద్ద చేప దాడిలో గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి మాచ్‌ఖండ్ పోలీస్‌స్టేషన్ పరిధి వనక ఢిల్లి గ్రామ పంచాయతీకి చెందిన శుక్ల గొలారి, మరో జాలరితో కలిసి మాచ్‌ఖండ్ నదిలో చేపలు పట్టడానికి శనివారం వెళ్లాడు. మాచ్‌ఖండ్ నది ఒడ్డున రాతిమీద వంట వార్పు చేసుకొని వలని వేస్తూ చేపలు పడుతున్నారు. ఇదే సమయంలో శుక్ల వలలో అతి పెద్ద చేప పడింది. అటువంటి భారీ చేప ఇక్కడ ఎన్నడూ చూడలేదు. దీంతో వలని గట్టిగా లాగాడు. అయితే ఆ చేప నదిలో గిలగిలలాడుతూ ఎదురు తిరిగింది. దీంతో శుక్ల నదిలో పడి గల్లంతయ్యాడు. ఇది చూసిన సహచర జాలరి భయంతో గ్రామానికి వెళ్లి జరిగింది చెప్పాడు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిమాపక బృందం నదిలో శుక్ల కోసం గాలింపు చేపడుతోంది.

క్లుప్తంగా

3న కారా మాస్టారు శతజయంతి సెమినార్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో నవంబరు 3న కాళీపట్నం రామారావు మాస్టారు శతజయంతి సెమినార్ శ్రీకాకుళ సాహితి, సాహితీ స్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, సీహెచ్ దివాకర్‌తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల కవులు, రచయితలు హాజరవుతారని పేర్కొన్నారు. సాహిత్యాభిమానులంతా పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: కండక్టర్లుగా అంకితభావంతో పనిచేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన ఉద్యోగులకు కుటుంబాల్లోని నలుగురికి శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలోని ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఎం.సుగుణమణి (భర్త కె.కాంతారావు డ్రైవర్), ఎంఎల్. నారాయణ (తండ్రి ఎంఎం రావు, డ్రైవర్), ఎస్.సంజయ్ (తండ్రి ఎస్.జి.మూర్తి, డ్రైవర్), డి.వినయ్ కుమార్ (తండ్రి బి.పి.రావు డ్రైవర్)లకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణవేణి, ఎంకెనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు సిలిండర్లకు నాలుగు నిబంధనలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్ కనెక్షన్ ఉన్న అర్హత గల ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా అందజేయనుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, తెలుపు రేషన్/బియ్యం కార్డు, ఆధార్‌తో లింకైన బ్యాంకు ఖాతా నంబరు, గ్యాస్ కనెక్షన్ నంబరు కలిగి ఉన్నవారే అర్హులని స్పష్టం చేశారు. తొలి విడత ప్రయోజనం కోసం ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. తర్వాత నాలుగు నెలలకోసారి పథకం వర్తిస్తుందని తెలిపారు. ముందుగా బుక్ చేసుకుని ఎప్పట్లాగే ఏజెన్సీకి డబ్బులు చెల్లించాలని, లబ్ధిదారు అర్హులైతే వెంటనే మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుందని చెప్పారు. ఆ మొత్తం పట్టణంలో ఒక రోజులో, గ్రామీణ ప్రాంతంలో 3 రోజుల వ్యవధిలో బ్యాంకు ఖాతా జమ అవుతుందని వివరించారు.

బెలమరలో చైన్‌స్నాచింగ్

పోలాకి : ఈవినింగ్ వాక్‌కు వెళ్లిన మహిళ మెడలో గొలుసు తెంపి పారిపోయిన ఘటన పోలాకి మండలం బెలమర గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. బెలమర గ్రామానికి చెందిన పాట్నూరు కనకరత్నం మరో ఇద్దరు మహిళలతో కలిసి వాకింగ్‌కు వెళ్లారు. డీపీఎస్ రహదారిపై వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన దుండగుడు కనకరత్నం మెడలోని గొలుసు తెంచి పారిపోయాడు. వెంటనే స్థానికులు అప్రమత్తమై బైకులపై వెంబడించినా దుండగుడి ఆచూకీ దొరకలేదు. తులంన్నర బంగారు గొలుసు పోవడంతో బాధితురాలు పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి క్రైంబ్రాంచి సిబ్బందితో కలిసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు న్యాయమూర్తులకు బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇద్దరు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజాం సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ వివేక ఆనంద్ శ్రీనివాసను శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు, అడిసినల్ డిస్ట్రిట్ సెషన్సు కోర్టు న్యాయమూర్తిగా నియమించారు. శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు, అడిషినల్ డిస్ట్రిట్ సెషన్సు కోర్టు న్యాయమూర్తిగా ఉన్న పి.భాస్కరరావును శ్రీకాకుళంలోనే ఫస్ట్ అడిషినల్ డిస్ట్రిట్ అండ్ సెషన్సు కోర్టు న్యాయమూర్తిగా నియమించారు.

మత్స్యకారుడు మృతి



పాకల గణపతి(ఫైల్)

గార: నదిలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకొని మృతి చెందాడు. గార మండలం కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలేం గ్రామానికి చెందిన పాకల గణపతి (41) శుక్రవారం ఉదయం వంశధార నదిలోకి చేపల వేటకు వెళ్లాడు. శనివారం కళింగపట్నం సంతతోట రేవు వద్ద మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నది ఊబిలో చిక్కుకుపోయి చనిపోయి ఉంటాడని తోటి మత్స్యకారులు భావిస్తున్నారు. ఏఎస్ఐ తెలుగు చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గణపతికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సొంత నిధులతో..
స్నానాల ఘాట్ శుభ్రం



మహేంద్రతనయ నది స్నానాల ఘాట్



మహేంద్రతనయ నది స్నానాల ఘాట్‌ను శుభ్రం చేయిస్తున్న రంజిత్ మహాపాత్రో

పర్లాకిమిడి: కార్తీక పౌర్ణమి నాడు పవిత్ర మహేంద్రతనయ నదిలో ఒడియా, తెలుగు ప్రజలు వేకువజామున అరటి దొప్పలుతో తయారు చేసిన నావలును మహిళలు వదులుతారు. దీనిని ఒడిశా వారు బోయిత బంధన్ ఉత్సవం అని పిలుస్తారు. ఈ ఉత్సవం వెనుక కథ ఉంది. చోళ వంశం రాజుల కాలంలో ఒడిశా నుంచి ఏడుగురు వ్యాపారులు ఇండోనేషియాలోని బాలికి వ్యాపార నిమిత్తం పడవల్లో పయనమవుతారు. వారు ఎన్ని సంవత్సరాలైనా రాకపోవడంతో వారి భార్యలు కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. అనంతరం వ్యాపార నిమిత్తం ఇండోనేషియా నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తారు. అందువల్ల ఆనాటి నుంచి కార్తీక పౌర్ణమి నాడు వేకువజామున అరటి దొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి పడవలు చేసి నదుల్లో వదలటం ఆనవాయితీ. మహేంద్రతనయ నది ఒడ్డున ఇటీవల దుర్గాష్టమి తరువాత నిమజ్జనోత్సవం తరువాత చెత్త చెదారం పేరుకుపోయింది. నది శుభ్రతకు అటు కెరండీ పంచాయతీ అధికారులు కానీ, పర్లాకిమిడి పురపాలక సంఘం అధికారులు కానీ పట్టించుకోపోవడంలేదు.

ఔదార్యం..



సామాజిక కార్యకర్త రంజిత్ మహాపాత్రో

రాజవీధికి చెందిన రంజిత్ కుమార్ మహాపాత్రో తన సొంత డబ్బులు ఖర్చుపెట్టి శనివారం నది ఒడ్డును శుభ్రం చేయించా. మహేంద్రతనయ నది స్నానాల ఘాట్ పరిశుభ్రం అయింది. రాజవీధిలో జ్యూస్ షాపు నిర్వహిస్తున్న రంజిత్ కుమార్ మహాపాత్రో ప్రతి ఏటా మహేంద్రతనయ నది ఒడ్డున చెత్తను తొలగించే ప్రక్రియ చేపడుతుండటం విశేషం. ప్రతి ఏటా కార్తీక మాసంలో కూలీలు, ప్రొక్లెయిన్లతో నది ఒడ్డును శుభ్రం చేయించడం, శ్రీజగన్నాథ మందిరం వద్ద పేరకుపోయిన దీప, ప్రమిదలను తొలగించే పనికూడా చేపడుతుండటం విశేషం. ఆయన చేస్తున్న ఈ పుణ్యకార్యానికి పలువురు హర్షిస్తున్నారు.

విస్తరిస్తున్న 'స్థానిక' నినాదం



బొరిగుమ్మ సమావేశంలో మాట్లాడుతున్న మున్నా రథో

జయపురం: జిల్లా పరిధిలోని ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలన్న డిమాండ్ కొరాపుట్ జిల్లాలో అన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. శనివారం బొరిగుమ్మలో ఆదివాసీ జాగరణ మంచ్ వారు నిర్వహించిన అత్యవసర సమావేశంలో నవరంగపూర్ జిల్లాలో ప్రముఖ రాజకీయ నేత, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మున్నా రథో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బొరిగుమ్మ సమితి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కె.నారాయణ దొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్నా రథో మాట్లాడుతూ అవిభక్త కొరాపుట్ జిల్లాలో విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించటం లేదని తెలిపారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే మన జిల్లాలో గల ఉద్యోగాలు మన జిల్లాలోని వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించేంత వరకు ఆందోళన జరపాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో ఆందోళన చేపట్టేందుకు ఒక కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు.

కమిటీ అధ్యక్షులుగా కె.నారాయణ దొర, కార్యదర్శిగా బొరిగుమ్మ సర్పంచ్ తుషార కాంత కుంభారిక, సమితి చైర్మన్ దీప్తి మయి నాయిక్, ప్రసాద్ బిడిక, నరేంద్ర బిసాయి తదితరులను నియమించారు.

చెట్లు నరికివేత



దుండగులు వదిలేసిన కలప

జయపురం: స్థానిక సమితి పరిధిలోని అంబాగుడ గ్రామంలో శుక్రవారం రాత్రి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) కార్యాలయ ప్రాంగణంలోని విలువైన రెండు చెట్లను దుండగులు నరికివేశారు. దుంగలను తరలించేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన ఆర్ఐ వెంటనే అటవీ అధికారులకు, జయపురం తహసీల్దార్‌కు తెలియజేసారు. అటవీ విభాగ సిబ్బంది వెంటనే వచ్చి దుంగలను స్వాధీన పర్చుకున్నారు. చెట్లు నరికిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం గాలిస్తున్నామని రేంజర్ సదాశివ పారిడ వెల్లడించారు. ఈ ప్రాంతంలోని అనేక పురాతన చెట్లను దుండగులు నరికివేసి తరలిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రిన్సిపాల్

జయపురం: కళాశాలలో శాంతిని నెలకొల్పటంలో విద్యార్థుల తల్లిదండ్రుల భూమిక గురుతరమైనదని మా ఘురొ ఫౌండేషన్ అధ్యక్షుడు, న్యాయవాది రుతుపూర్ణ మహంతి అన్నారు. శనివారం జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడలో గల సహిద్ లక్ష్మణ నాయిక్ డిగ్రీ కళాశాలలో "పేరెంట్స్ ఫర్ పీస్"పై నిర్వహించబడిన వర్క్ షాపులో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మా ఘురొ ఫౌండేషన్, తాల్చేర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన వర్క్ షాపులో ప్రసంగించారు. నేటి యువత మంచి పరివర్తనతో శాంతిని ఎలా నెలకొల్పగలరో వివరించారు. సమాజంలో, కుటుంబ లో శాంతి వాతావరణం ఉండాలన్నారు. ఈ వర్క్ షాపులో సమాజసేవి మురళీధర బొరడ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత పట్నాయిక్, యాజమాన్య కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మహాపాత్రో, కళాశాల అధ్యాపకులు ప్రసంగించారు. విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పది కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి కేరళకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న పశ్చిమబెంగాల్ వ్యక్తిని ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం బొసిపుకుర్పరా గ్రామానికి చెందిన రైహ ఆలీ ఒడిశాలోని శేరఘడ గ్రామంలో 10.15 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి బస్సులో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు శనివారం ఉదయం చేరుకొన్నాడు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేయగా నిందితుడు పట్టుబడ్డాడు. అతని వద్ద బ్యాగులో 10.15 కేజీల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. గంజాయిని కేరళలోని తిరూర్‌కు తీసుకెళ్లి రాఫీ అలియాస్ జలీల్ అనే వ్యక్తికి అందజేసేందుకు వెళ్తున్నట్లు పోలీసులు విచారణలో తేలిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు, క్రైమ్‌సిబ్బంది బషీర్, షబ్బీర్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

సోంపేట: గంజాయి కేసులో నిందితుడిని కారులో శ్రీకాకుళం తీసుకెళ్తుండగా పాలవలస జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి 9.30 గంటల టైర్ పంక్చర్ కావడంతో బోల్తాపడింది. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు, నిందితుడు రిహాన్ ఆలీకి స్వల్పగాయాలయ్యాయి. నిందితుడిని వేరే వాహనంలో శ్రీకాకుళం తరలించారు.

పులి భయం



దంపింగు యార్డు పరిసరాల్లో జంతువు పాద ముద్రలు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో రాత్రి పూట పులి సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని విధి నిర్వహణలో ఉన్న విమానాశ్రయ సిబ్బంది కూడా బలపరచడంతో మరింత భయం వ్యాపించింది. సమాచారం అందడంతో అటవీ శాఖ పూర్తి సరంజామాతో విమానాశ్రయం డంపింగు యార్డు ప్రాంగణానికి చేరింది. ఈ పరిసరాల్లో పాద ముద్రల్ని గుర్తించారు. వీటి ప్రాథమిక పరిశీలనలో పులి పాద ముద్రలు కావని అటవీ శాఖ యంత్రాంగం ధ్రువీకరించింది. తెరిపి లేకుండా వాన కురుస్తున్నందున పాద ముద్రల్లో తేడా చోటు చేసుకుని ఉంటుందనే అనుమానం బలపడింది. అధికారుల పరిశీలన ప్రకారం తోడేలు జాతి జంతువు పాద ముద్రలుగా భావిస్తున్నారు. లోగడ ఈ ప్రాంతంలో చిరుత పులి సంచారం దాఖలాలు ఉన్నట్లు సమాచారం.

బస్సు కిందపడి వ్యక్తి దుర్మరణం



సువ్వారి లోకనాథం(ఫైల్)

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే దారిలో కొత్తరోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రూరల్ మండలం నందగిరిపేటకు చెందిన సువ్వారి లోకనాథం (35) కొన్నాళ్లుగా శ్రీకాకుళం బీసీ బాలుర వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని ఓ ప్రైవేటు కళాశాల బస్సులో ఇంటికి పయనమయ్యాడు. కొత్తరోడ్డు సమీపంలో ట్రాఫిక్ స్తంభించడంతో బస్సు నుంచి కిందకి దిగాడు. డ్రైవర్ ఈ విషయం గమనించక బస్సు నడిపించడంతో లోకనాథం టైరు కింద పడి మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, కుమార్తె ఆమని, కుమారుడు కార్తీక్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రూ.24 లక్షల విలువైన 154 ఫోన్లు రికవరీ

- ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందించిన పోలీసులు
- సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోండి: ఎస్పీ



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే రికవరీకి వీలుంటుందని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లాలో ఇటీవల ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు రూ.24 లక్షలు విలువైన 154 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు 1600 ఫిర్యాదులకు గాను 772 ఫోన్లను బాధితులకు అందజేశామని చెప్పారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే తక్షణమే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది టెలికమ్యూనికేషన్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సిఇఐఆర్.జిఒవి.ఐఎన్ అనే వెబ్‌సైట్‌కి వెళ్లి బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకుంటే జిల్లాలోని సైబర్ సెల్ విభాగం రిక్వెస్ట్‌ను రిసీవ్ చేసుకుంటుందని, అనంతరం మొబైల్‌ను ట్రాక్ చేసి రికవరీ చేస్తారని వివరించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

శ్రీకాకుళం క్రైమ్ : అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటీపీ, లింక్ క్లిక్, మాల్వేర్, ఏపీకే ఫైల్ తరహా నేరాలతో పాటు డిజిటల్ ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు.

వ్యక్తిగత వివరాలను అపరిచిత వ్యక్తులు, సంస్థలకు తెలియజేయకూడదన్నారు. బెదిరింపు వీడియోకాల్స్, ఫోన్ కాల్స్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాల ని ఎస్పీ సూచించారు.

పాకశాలలో ప్లాంట్

- శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో నిబంధనలకు తూట్లు
- పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటుపై విమర్శలు
- ఆలయ పవిత్రత దెబ్బతింటుందన్న భక్తులు



స్వామివారి పాకశాల

జలుమూరు:

దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీముఖలింగం ఆలయంలో స్వామివారికి బోగం, ప్రసాదం, కైంకర్యాలు తయారు చేసే పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇందులో తాగునీటి యంత్రాలు, పైపులు, ఇతర పరికరాలు ఏర్పాటు చేయడం వల్ల ఆలయ సంప్రదాయాలకు తిలోదాలకు ఇచ్చారని భక్తులు, ఆలయ అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో పాకశాలలోకి బోగం తయారు చేసే అర్చకులు మాత్రమే ప్రవేశం ఉంది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్ చేయడంతో నిర్వాహకులు, ఇతర వ్యక్తులు సరైన శుభ్రత పాటించకుండా లోపలికి వెళ్తున్నారు. కొందరు ఏకంగా గుట్కా,పాన్ మసాలాలు వేసుకొని పాకశాలలోకి ప్రవేశం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బయట వ్యక్తులు సైతం ప్లాంట్ కుళాయి వద్ద చేతులు, కాళ్లు, ముఖం శుభ్రం చేసుకుంటూ ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. స్వామివారికి బోగం తయారు చేసే సమయంలో నిర్దేశిత వంటవారు, అర్చకులు మినహా ఇతరులు ఎవరూ ఉండకూడదు. బోగం నివేదించిన సమయంలో ఎవరి కంట కనపడకుండా నియమ నిష్టలతో నివేదన చేయడం ఆలయ సంప్రదాయం. ఇక్కడ ఇవేవీ అమలు కాకపోవడంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పాకశాలలో తాగునీటి ప్లాంట్, యంత్రాలు

పవిత్రతకు ముప్పు..



స్వామివారి ప్రసాదం, కైంకర్య, బోగాలు తయారు చేసే సమయంలో శుచి, శుభ్రత, గోప్యత ఉండాలి. ఇక్కడలా లేదు. తాగునీటి ప్లాంట్‌ను పాకశాలలో ఏర్పాటు చేయడంతో ఇతరులు వచ్చేస్తున్నారు. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు చొరవ తీసుకొని సమస్యకు పరిష్కారం చూపాలి.

– బసవ సుబ్బారావు, అర్చకులు, శ్రీముఖలింగం

వేరేచోటకు మార్చుతాం..

దేవాలయం ఆలవరణలో తగిన స్థలం లేకపోవడంతో ప్లాంట్ పాకశాలలో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీని వల్ల భక్తులకు అసౌకర్యం కలగడం వాస్తవమే. పాకశాల మిషన్లను వేరేచోటకు మార్చుతాం. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం.

– నవీన్, కన్జర్వేటివ్ అధికారి, విశాఖపట్నం

నిర్లక్ష్య వైఖరి తగదు..



ఎంతో విశిష్టత గల దేవాలయంలో స్వామివారికి నివేదించే పాకశాల నిర్వహణను గాలికి వదిలేయడంతో భక్తులు మనోభావాలు దెబ్బతింటున్నాయి. ప్రసాదాలు, బోగం, కైంకర్యం తయారు చేసే పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది.

– ఉమామహేశ్వరరావు, భక్తుడు, శ్రీకాకుళం

జగన్‌ను ఇబ్బంది పెట్టేందుకు షర్మిల కుట్ర



మాట్లాడుతున్న టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్

కోటబొమ్మాళి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపించి ఇబ్బంది పెట్టేందుకే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కుట్రలు, కుతంత్రాలకూ తెరలేపారని టెక్కలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ ధ్వజమెత్తారు. శనివారం కోటబొమ్మాళి మండలం జర్జంగిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ షర్మిల కాంగ్రెస్‌లో ఉంటూ స్వార్థ రాజకీయాల కోసం టీడీపీ, జనసేన, బీజేపీతో స్నేహం చేస్తూ దొంగ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కుట్రలు వెనుక ఎవరున్నారో త్వరలో బయటపడతారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి తీరా అధికారంలోకి వచ్చాక హామీలను మరిచి ప్రజలను మోసగించిందని దుయ్యబట్టారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కుటిల రాజకీయాలు చేస్తున్నారని, వారికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా బలమున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని, జమిలీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయదుందుభి మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లేశ్వరరావు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

డచ్ బిల్డింగ్ చుట్టూ ఉద్యానవనం



ఉద్యానవన ప్రణాళికను కలెక్టర్‌కు వివరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని 300 ఏళ్ల నాటి పురాతన డచ్ భవనం చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మంత్రి డచ్ బంగ్లాను శనివారం పరిశీలించారు. ఢిల్లీ గేట్ తరహాలో డచ్ భవనం చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నాగావళి నది కనిపించేటట్లు, శ్రీకాకుళం నగర ప్రజానీకం సేద తీరేందుకు ఒక ఐకానిక్‌గా డచ్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలన్నారు. రూ.100 కోట్లతో ప్రపంచ ప్రసిద్ధ దేవాలయం అరసవెల్లి సర్క్యూట్‌ను త్వరలోనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే విధంగా శ్రీకూర్మం సర్క్యూట్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే సిక్కోలు సంబరాలు నిర్వహిస్తామన్నారు. రహదారులు, భవనాల గ్రౌండ్‌లో దీపావళి సంబరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, పర్యాటకశాఖాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో ఆర్ట్ గ్యాలరీ

• ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



ఆర్ట్ గ్యాలరీని పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జిల్లా కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేయడంతోపాటు సుందరమైన ప్రకృతి సోయగాల పరిసరాలను రూపకల్పన చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జ్యోత్స్న



స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించిన జ్యోత్స్న

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పతివాడ జ్యోత్స్న ఎంపికైంది. ఇటీవల జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో 600 మీటర్ల పరుగుపోటీతో పాటు 400 మీటర్ల పరుగు పోటీలో ప్రథమస్థానం సాధించిన జ్యోత్స్న త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్‌జిల్లాల స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీబీ చారి తెలిపారు. జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్న విద్యార్థినితో పటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు రవి, ప్రసాద్‌లను చారి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జ్యోత్స్న పతకాలు దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరంలోని బుంగవీధికి చెందిన మంగళగిరి గణేష్‌ను గూడ్స్ షెడ్ రోడ్డులో అదుపులోకి తీసుకుని మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. నిందితుడి దగ్గర నుంచి గంజాయితో పాటు స్కూటీ, రూ.220 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదేవిధంగా మరో కేసుకు సంబంధించి మూడు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'పది' పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

• 28 నుంచి చెల్లింపు ప్రారంభం

విజయనగరం అర్బన్: ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలకు ఫీజు చెల్లించే షెడ్యూల్‌ను శనివారం ఎస్ఎస్ సి బోర్డు విడుదల చేసింది. ఈ మేరకు డీఈవో యు మాణిక్యం నాయుడు వివరాలను ప్రకటించారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌ను కూడా ప్రధానోపాధ్యాయులు ఈ తేదీలోపే పంపించాలని సూచించారు. అన్ని సబ్జెక్టులకు (మూడు సబ్జెక్టులు మించి) రూ.120, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, వొకేషనల్ విద్యార్థులు సబ్జెక్టుకు అదనంగా రూ.60, నిర్ణీత వయసు కంటే తక్కువ ఉన్నవారు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.60 చెల్లించాలని పేర్కొన్నారు. రూ. 50 ఆలస్య రుసుముతో వచ్చే నెల 18వ తేదీ, రూ.200 ఆలస్య రుసుముతో వచ్చేనెల 25వ తేదీ, రూ.500 లేట్ ఫీజుతో నవంబరు 30 లోపు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



గంగాధర్ మృతదేహం

విజయనగరం క్రైమ్: టాయిలెట్‌కి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు సున్నంబట్టి వీధి సమీపంలో నివాసం ఉంటున్న గంగాధర్ (30) తల్లితో కలిసి ఆటోలో గూడ్స్ షెడ్ వైపు వెళ్తున్నాడు. రైల్వేఅండర్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి టాయిలెట్‌కి వెళ్లివస్తానని ఆటోను పక్కన ఆపించి, రోడ్డు దాటే క్రమంలో అటు నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడంతోతలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెట్టీపై జాప్యం ఎందుకో?

• నిర్మాణానికి గతంలో రూ.23 కోట్లు మంజూరు
• శంకుస్థాపన చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
• అధికారంలోకి వచ్చాక ఊసెత్తని కూటమి సర్కారు
• అవస్థలు పడుతున్న గంగపుత్రులు



చింతపల్లితీరంలో జెట్టీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

పూసపాటిరేగ: తీరప్రాంతం చింతపల్లిలో మంజూరైన జెట్టీ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వం హయాంలో చింతపల్లికి రూ.23 కోట్లతో జెట్టీ మంజూరు చేశారు. అన్ని అడ్డంకులు తొలిగి ఆర్థికశాఖ అనుమతులు వచ్చిన తరువాత అప్పట్లో సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఈ జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతున్నా జెట్టీ ఊసెత్తలేదు. జిల్లాలో తీరప్రాంత మత్స్యకారుల ప్రధాన అవసరమైన జెట్టీ నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెట్టీ నిర్మాణం కాకపోవడం, తరచూ తుఫాన్ల హెచ్చరికలు జారీ అవడం వంటి కారణాలతో తీరప్రాంతం నుంచి సుమారు 3 వేల మంది మత్స్యకారులు వలస బాట పట్టారు.

ఇదీ పరిస్థితి ..

జిల్లాలో తీరప్రాంతమైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సుమారు 21 వేలు మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 6 వేల మంది చేపలు వేటే ప్రధాన వృత్తిగా చేస్తున్నారు. 15 వేల మంది వారిపై పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. రెండు మండలాల్లో 885 బోట్లలో సుమారు 3798 మంది మత్స్యకారులు నిత్యం వేటను సాగిస్తుంటారు. వేటలేక వివిధ కారణాల రీత్యా మరో 3000 మంది మత్స్యకారులు బతుకుతెరువుకోసం విశాఖ, గుజరాత్, సూరత్, హీరావల్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. తీరంలో జెట్టీ నిర్మాణం కాకపోవడంతో విపత్తుల సమ యంలో పడవలు, వలలు సముద్రంలో కొట్టుకుపోయి నష్టాలు చవిచూస్తున్నామని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు.

కాలుష్యంతో మత్స్య సంపద నాశనం

జెట్టీ సమస్యతో పాటు పరిశ్రమల వ్యర్థ రసాయనాలు తమ పొట్ట కొడుతున్నాయని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. రసాయన పరిశ్రమల వ్యర్థ జలాలు సముద్రంలో కలియడంతో మత్స్యసంపదకు తీవ్రనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలం క్రితం వరకు చేపల వేటకు వెళ్తే భారీగా వలకు చేపలు చిక్కేవి. నేటి పరిస్థితి చూస్తే బిన్నంగా ఉండదని వాపోతున్నారు. పరిశ్రమల వ్యర్థ జలాలు కారణంగా మత్స్య సంపద వలకు చిక్కడం లేదు. చేపల వేట సాగని గంగపుత్రులు జీవనోపాధి కరువై వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

జెట్టీ నిర్మించాలి

జెట్టీ లేకపోవడంతో వేట చేసిన తరువాత ఒడ్డుకు చేరిన బోట్లకు రక్షణ లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీవ్రనష్టాలు చవిచూస్తున్నాం. గత ప్రభుత్వంలో జెట్టీకి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం జెట్టీ నిర్మాణంపై నిర్లక్ష్యం చేయకుండా నిర్మాణంపై దృష్టి సారించాలి.

బి. అప్పలస్వామి, బర్రిపేట

ఉపాధికోసం ఎదురు చూపులు

చేపల వేటపైనే ప్రధానంగా అధారపడి జీవిస్తున్న మత్స్యకారులు జెట్టీ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. జెట్టీ లేకపోవడంతో పాటు పరిశ్రమల కాలుష్యం కారణంగా వేట సాగకపోవడంతో జీవనోపాధి కోల్పోతున్నాం. నూతన ప్రభుత్వంలో జెట్టీ నిర్మాణం ప్రారంభించి సకాలంలో పూర్తి చేసి మత్స్యకారులను ఆదుకోవాలి.

బి. కొర్లయ్య, చింతపల్లి

గ్రామ సదస్సుల్లో రీ సర్వేపై 8,030 ఫిర్యాదులు

• 15 రోజుల్లో పరిష్కారం
• సర్వే శాఖ జిల్లా అధికారి రమణమూర్తి



కె రమణమూర్తి, సర్వే శాఖ జిల్లా అధికారి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈనెల 15 నుంచి ప్రారంభమైన గ్రామ సదస్సుల్లో రీ సర్వేకు సంబంధించిన ప్రక్రియపై 8,030 ఫిర్యాదులు అందాయని సర్వే శాఖ జిల్లా అధికారి కె.రమణమూర్తి తెలియజేశారు. జిల్లాలోని 938 గ్రామాలలో రీ సర్వే ప్రక్రియను చేపట్టడానికి గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మూడు విడతలుగా లక్ష్యాలను తీసుకుని దాదాపు 50 శాతానికి పైగా 530 గ్రామాలలో రీ సర్వేని పూర్తి చేసింది. మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే పనులను ప్రారంభించగా పనులు కొనసాగుతున్నాయి. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం మారడంతో రీ సర్వే పనులు స్తంభించాయి. ఇంతవరకు మూడు దశల్లో పూర్తి చేసుకున్న రీ సర్వే పనుల్లో ఎలాంటి అవకతవకలున్నా సరిచేయాలనే లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వం గ్రామస్థాయిలో సభలను నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలని భావించి గ్రామ సభల ప్రక్రియను ఈనెల 15వ తేదీ నుంచి చేపట్టనుంది. రీ సర్వే ప్రక్రియలో ప్రధానంగా భూ విస్తీర్ణ హద్దులు, మ్యుటేషన్ వంటి ఐదు అంశాల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను 15 రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సర్వే ఎ.డి రమణ మూర్తి తెలియజేశారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్న సీఐ ఇందిరదేవి, ఎస్సై రామారావు తదితరులు

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామం సమీప తోటల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.ఇందిరదేవి ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. సారా తయారీపై గ్రామపరిసరాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. దీంతో గ్రామం సమీపంలో రహస్య ప్రదేశంలో 6 డ్రమ్ములతో పులియబెట్టిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే అదే ప్రాంతంలో నిల్వ ఉంచిన 10 లీటర్ల సారాను పారబోసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వచ్చిన అలికిడికి అక్కడినుంచి సారా తయారీ దారులు జారుకున్నారు. సారా తయారీకి వినియోగించే డ్రమ్ములు,పెద్ద పెద్ద పాత్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం సీఐ ఇందిరదేవి మాట్లాడుతూ సారా తయారీ దారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎస్.వి.రామారావు,హెచ్‌సీ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సారాతో నిందితుడి అరెస్ట్

వంగర: మండల పరిధి మగ్గూరు జంక్షన్ వద్ద ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సారాతో పట్టుకున్నట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఆ నిందితుడి నుంచి 3.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్రీడా సముదాయానికి పదెకరాలు



కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వరరావు తదితరులు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో క్రీడా సముదాయం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పది ఎకరాల స్థలాన్ని కేటాయించడం పట్ల జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, శాప్, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సీతానగరం మండలంలోని జోగింపేట వద్ద క్రీడా సముదాయానికి స్థలాన్ని కేటాయించడం కలెక్టరేట్‌కు వెళ్లి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సీతానగరం తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు స్థలాన్ని క్రీడా ప్రాధికార సంస్థకు శనివారం అప్పగించారు.

ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధి తలగాం గ్రామం సమీపంలో శనివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఎదురెదురుగా బైక్‌లపై వస్తున్న కె.గౌరీశ్వరరావు, పి.రాంబాబులు ఒకరినొకరు ఢీకొట్టి కిందపడి గాయపడ్డారు. వైద్యం కోసం వారిద్దరిని రాజాం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

టీవీ రిపోర్టర్‌పై దాడి

• ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితుడు



దాడిలో గాయపడిన రిపోర్టర్



దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు గ్రంధి రామారావు నారా లోకేష్‌తో దిగిన ఫొటో (ఫైల్)

పార్వతీపురంటౌన్: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులు చేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగింది. శుక్రవారం ఓ టీవీ చానల్‌కు చెందిన జర్నలిస్ట్ తన కుటుంబంతో కలిసి పార్వతీపురం పట్టణంలోని 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌కు చెందిన ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. కుటుంబసభ్యులు బిర్యానీ కావాలని అడగడంతో చికెన్ ధమ్ బిర్యాని ఆర్డర్ పెట్టాడు. ఆర్డర్ పెట్టిన 20 నిమిషాలకు బిర్యానీని సర్వర్ టేబుల్ పైకి తీసుకు వచ్చాడు. బిర్యానీ పాచివాసన రావడంతో..బిర్యానీలో నాణ్యత లోపించిందని సదరు రెస్టారెంట్ యాజమాన్యాన్ని రిపోర్టర్ ప్రశ్నించాడు. దీనికి 12వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు గ్రంధి రామారావు తింటే తిను లేకపోతే బయటకు పో అంటూ వాగ్వాదానికి దిగాడు. తాను రిపోర్టర్ నని నాణ్యత లోపిస్తే ప్రజలకు చేరవేస్తానని రిపోర్టర్ చెప్పగా సదరు రిపోర్టర్‌పై టీడీపీ నాయకుడు భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఇంత జరుగుతున్నా రెస్టారెంట్ యాజమాన్యం ప్రేక్షక పాత్ర వహించడం శోచనీయం.

జర్నలిస్టు సంఘాల నిరసన

జర్నలిస్టుపై జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ పార్వతీపురం కలెక్టరేట్ ఆవరణలో జర్నలిస్టు సంఘాలు ఏపీడబ్ల్యూజే, పీయూజే శనివారం నిరసన తెలిపాయి. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి ఎస్పీ మాధవరెడ్డికి ఫోన్‌చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ధర్నాలు



ధర్నాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం నుంచి ఈ నెల 30 వరకు మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిం చనున్నట్లు ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి డి.పండు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ధర్నాకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 2 నుంచి 4వ తేదీవరకు కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దీక్షలను నిర్వహించడంతోపాటు నవంబర్ 6న చలో కలెక్టరేట్ పిలుపునిచ్చామన్నారు. విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లకు సంబంధించి విద్యాదీవెన, వసతిదీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.3వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్సీ, బీసీ, పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు సొంత భవనాలను, గిరిజన పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు అదనపు భవనాలను నిర్మించాలని కోరారు. ఈ ధర్నాల్లో విద్యార్థులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్, టి.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సారిపల్లిలో డయేరియా కలకలం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో డయేరియా కేసులు కలకలం సృష్టించాయి. ఇటీవల గ్రామంలో రెండు డయేరియా కేసులు నమోదైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఇద్దరిలో ఒకరు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారని, డయేరియా సోకలేదని సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిరాం తెలిపారు. మరొక వ్యక్తి నెల్లిమర్ల సీహెచ్‌సీలో చికిత్స తీసుకొని వెంటనే కోలుకున్నారని, ప్రస్తుతం ఇంటి వద్దనే ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. ముందస్తు జాగ్రత్తగా వైద్య శిబిరాన్ని కొనసాగించడంతో పాటు ఇంటింటా సర్వే కూడా చేస్తున్నామన్నారు. కాగా డయేరియా కలకలం సృష్టించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు శనివారం గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. తాగునీటి ట్యాంకులను పరిశీలించి ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ట్యాంక్‌లో నీటిని నింపే ప్రతిసారి క్లోరినేషన్ చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ రామకృష్ణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా మరణాలను వక్రీకరిస్తున్నారు...

• మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలి
• ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి అజశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

గుర్ల: డయేరియా మరణాలపై అధికారులు చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. డయేరియా మరణాలను అధికారులు, ప్రభుత్వం వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం పర్యటించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సొలిపిసోమరాజుపేట చంపావతి నది వద్దనున్న రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. గుర్ల సచివాలయ సిబ్బందితో మాట్లాడి తాగునీటి పరీక్షలు రోజూ చేస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుల వివరాలపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. అధికారులు చెప్పినట్లు డయేరియాతో ఒక్కరు మాత్రమే మృతి చెందితే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనిత ఎందుకు పర్యటించినట్లు అని ప్రశ్నించారు. డయేరియాతో మృతి చెందిన వారికి తన సొంత నగదును రూ.లక్ష ప్రకటించారంటే మృతి చెందిన వారు అందరూ డయేరియాతో మృతి చెందినట్టేనని ప్రభుత్వం ఒప్పుకున్నట్లుగా భావిస్తున్నామని చెప్పారు. డయేరియాతో మృతి చెందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం రూ. 25లక్షలు పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. గుర్లలో పర్యటించిన వారిలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు శివానంద్, ఎస్.రవికుమార్, ప్రజా ఆరోగ్యవేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ ఉన్నారు.

• సర్పంచ్‌లు, ఎంపీటీసీలను డమ్మీ చేసే కుట్ర..!
• ఉపాధి పనులు వెండర్స్‌కు అప్పగించే ప్రయత్నం
• టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టేందుకు సిద్ధమైన నేతలు
• కూటమి సర్కార్ తీరుతో ఆందోళన చెందుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు



అధికారాలకు కత్తెర!

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు సర్పంచ్‌లు ద్వారానే జరగాలి. బిల్లులు చెల్లింపులు కూడా వారి ద్వారానే జరగాలని శనివారం కొత్తవలస మండలానికి చెందిన సర్పంచ్‌లు ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. వెండర్స్‌కు ఉపాధి పనులు అప్పగించడం అంటే సర్పంచ్‌ల హక్కులను కాలరాయడమేనని సర్పంచ్‌లు తెలిపారు.

శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ, ఎంపీపీలు కూడా ఉపాధి హామీ పథకంలో వెండర్స్ విధానాన్ని వ్యతిరేకించారు. ఉపాధి పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలని గళమెత్తారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉపాధి హామీ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగాలని తీర్మానం చేసారు.

ఉపాధి పనులను సర్పంచ్‌లకు కాకుండా వెండర్స్(కాంట్రాక్టర్లకు) అప్పగించడం చట్ట విరుద్ధం. ఉపాధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలి. శనివారం జామిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జెడ్పీటీసీ గొర్లె సరయ, ఎంపీపీ అరుణ, సర్పంచ్‌లు వెల్లడించారు.

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు అందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే అధికంగా ఉన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు అన్నీ సర్పంచ్‌ల ద్వారానే నిబంధన ప్రకారం జరగాలి. కానీ కూటమి ప్రభుత్వానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తక్కువగా ఉండడంతో ఉపాధి పనులు చేపట్టడానికి వీలుండదని గుర్తించిన కూటమి ప్రభుత్వం కూటమి నేతలకు దోచిపెట్టేందుకు యత్నిస్తోంది. 2014లో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీల మాదిరి ఇప్పుడు వెండర్స్ (కాంట్రాక్ట్) వ్యవస్థను తెరమీదకు తెస్తున్నారు. వెండర్స్ పేరుతో కూటమి కార్యకర్తలతో ఉపాధి పనులు చేపట్టేందుకు కూటమి సర్కార్ ఎత్తుగడ వేస్తోంది. తద్వారా కార్యకర్తలు రూ.కోట్లు కొల్లగొట్టేందుకు గేట్లు తెరిచింది. ఉపాధి హామీ మెటీరియల్ పనులు వెండర్స్‌తో చేసేందుకు సిద్ధమవుతున్నారు.

• సర్పంచ్‌లు, ఎంపీటీసీలను డమ్మీ చేసే కుట్ర

అధికారంలోకి వచ్చేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలపై వల్లమాలిన ప్రేమను కూటమి నేతలు ఎన్నికల సమయంలో చూపించారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సర్వహక్కులు కల్పిస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గొప్పలు చెప్పారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల హక్కులను కాలరాసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే వారిని డమ్మీలను చేసే కుట్ర చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమను తీర్మానాలకే పరిమితం చేసే విధంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

జన్మభూమి తరహా దోపిడీకి స్కెచ్


2014 – 19 మధ్య కాలంలో చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసింది. పింఛన్ కావాలన్నా, ఇల్లు కావాలన్నా.. జన్మభూమి కమిటీ అనుమతి లేనిదే రాని పరిస్థితి. జిల్లా అధికారులు సైతం జన్మభూమి కమిటీ సంతకం లేనిదే ఏ పని చేసే వారుకాదు. దీంతో ఇళ్లు, ఫించన్లు ఇస్తామని చెప్పి జన్మభూమి కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా దోచుకున్నారు. మళ్లీ అదే తరహా వ్యవస్థను కూటమి ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చి కార్యకర్తలు దోచుకోవడానికి గేట్లు తెరిచేసారు.

ఉపాధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని గొప్పలు

డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఉపాధి హామీ మెటీరియల్ పనులు చేపట్టేందుకు కోట్లాది రుపాయిలు ఖర్చు చేస్తున్నామని ఇటీవల చెప్పారు. ఈ నిధులతో గ్రామాల స్వరూపాన్నే మార్చేస్తామని గొప్పలు చెప్పారు. పల్లె పండగ పేరిట పలు పనులకు శంకుస్థాపనలు కూడా చేస్తున్నారు. ఈ కార్యక్రమాలకు అధికార పార్టీ నేతలే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సైతం పిలవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉచిత వంటగ్యాస్ పథకం జీఓ విడుదల

• లబ్ధిదారుల అర్హతపై క్లారిటీ లేని జీఓ
• జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్లు 7.03 లక్షలు : డీఎస్ఓ



విజయనగరం అర్బన్:

ఉచిత వంట గ్యాస్ పథకానికి సంబంధించిన జీఓను కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు శనివారం విడుదల చేసింది. అయితే లబ్ధిదారుల అర్హతను తెలిపే అంశాలు ఆ జీఓలు లేవు. వంట గ్యాస్ కనెక్షన్ ఉన్న వాళ్లలో తెల్ల రేషన్ కార్డు, బియ్యం కార్డు ఉన్న వాళ్లందరూ అర్హులని తెలియజేయలేదు. గ్యాస్ కనెక్షన్‌కి ఈకేవైసీ చేయించుకుని, ఆధార్, తెల్ల రేషన్‌కార్డ్ అనుసంధానం మాత్రమే విధిగా చేసుకోవాలని జీఓలో స్పష్టం చేశారు. తెల్ల కార్డుదారులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీఎస్ఆర్ ద్వారా రాయితీపై వంట గ్యాస్ కనెక్షన్లు పొందిన వారు ఉన్నారు. వాళ్లు ఈ పథకానికి అర్హులు అవుతారో.. లేదో అన్న విషయంపై ఎలాంటి ప్రస్తావన లేదు.

జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్లు 7.03 లక్షలు

జిల్లాలో 34 గ్యాస్ ఏజెన్సీల పరిధిలోని 7,03,273 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వివిధ రాయితీ పథకాల ద్వారా తెల్లకార్డుదారులు పొందిన గ్యాస్ కనెక్షన్లు 3,56,818 ఉన్నాయి. వీటిలో రాష్ట్రం రాయితీ ఇచ్చిన దీపం పథకం ద్వారా 1,85,254 కనెక్షన్లు, కేంద్రం రాయితీ ఇచ్చిన ఉజ్వల పథకం ద్వారా 43,287 కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన 3,46,455 సాధారణ గ్యాస్ కనెక్షన్లలో రాయితీ పథకాల పొందని తెల్ల కార్డుదారులు ఉన్నారు. వీటి సంఖ్య తెలియాల్సి ఉంది. రాయితీ పథకాలకు ఉచిత గ్యాస్ పథకం వర్తించకపోతే సాధారణ కనెక్షన్‌లో ఉన్న తెల్ల కార్డుదారులు మాత్రమే ఈ పథకానికి అర్హులవుతారు. లబ్ధిదారుల అర్హతకు సంబంధించిన ప్రామాణికాలు ఇంకా రావాల్సి ఉందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి డి. మధుసూదనరావు తెలిపారు.